సాక్షి
బాపట్ల
బుధవారం, 29, జనవరి, 2025



బోల్తా కొట్టిన ఆటో
మంగళగిరి (తాడేపల్లి రూరల్) : మంగళగిరి జాతీయ రహదారి సర్వీస్‌రోడ్‌లో మంగళవారం ఆటో బోల్తా కొట్టింది. నలుగురికి గాయాలయ్యాయి.



ఈవీఎంల గిడ్డంగి తనిఖీ
లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎంల గిడ్డంగిని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి మంగళవారం తనిఖీ చేశారు. భద్రతను పరిశీలించారు.



ఉత్తమ డీఎం అవార్డు
మాచర్ల: మాచర్ల ఆర్టీసీ డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి ఉత్తమ అవార్డును కలెక్టర్ అరుణ్ బాబు నుంచి అందుకున్నారు. మంగళవారం వీరాస్వామిని పలువురు అభినందించారు.

చంద్రబాబు హ్యాండ్సప్

- ఎన్నికల ముందు ఆర్భాటపు ప్రకటనలు
- ప్రస్తుతం సంక్షేమ పథకాలకు మంగళం
- గత ప్రభుత్వంపై అభాండాలు
- మరోసారి తన నైజం చూపిన బాబు అంటూ జనం ఆగ్రహం



సాక్షి ప్రతినిధి, బాపట్ల: చంద్రన్న మాట నిలబెట్టుకుంటే సంచలనం.. మాట తప్పితే సర్వ సాధారణం. చంద్రన్న వెన్నుపోటు పొడిస్తే సర్వసాధారణం.. ఆయన వెనుక పోటు పొడవకపోతేనే సంచలనం. ఆయన హామీలు గుప్పిస్తే సర్వసాధారణం... హామీలు అమలు చేస్తేనే సంచలనం. వివిధ రాజకీయపార్టీలు, విశ్లేషకులతోపాటు అటు ప్రజల్లోనూ చంద్రన్నపై ఉన్న అభిప్రాయం ఇదే. అలాంటిది చంద్రన్న మాట మారిస్తే, ఇచ్చిన మాట తప్పితే! ఇది సర్వసాధారణం. ఇది సంచలనం ఏమాత్రం కాదు. ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు ఇప్పుడు అదే చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలేవీ నెరవేర్చలేనని నేరుగా చెప్పారు. అందుకు కారణం రాష్ట్ర ఆర్థిక పరిస్థితేనన్నారు. దానికి కారణం గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమేనని ఎప్పటిలాగే నిందలు వేశారు. రూ.14 లక్షల కోట్లు అప్పుచేసి ఈ రాష్ట్రాన్ని జగన్‌మోహన్‌రెడ్డి సర్వనాశనం చేశారని ఎన్నికల ముందు చంద్రబాబు మైకులు పగిలిపోయేలా గీపెట్టారు. అయినా సరే తనను ముఖ్యమంత్రిని చేస్తే అనుభవాన్ని రంగరించి, ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టి రాష్ట్ర అభివృద్ధిని పరుగుల పెట్టిస్తానన్నారు. జగన్ ఇచ్చిన దానికంటే రెండింతలు ఎక్కువగా సంక్షేమ పథకాలు ఇస్తానన్నారు. నమ్మి జనం ఓట్లేసి ముఖ్యమంత్రిని చేశారు. ఆ తర్వాత రాష్ట్రం అప్పులు రూ.6 లక్షల కోట్లేనని తేలడం, ఇందులో గత చంద్రబాబు ప్రభుత్వం చేసిన అప్పులు కూడా ఉన్నాయని తేటతెల్లం కావడం అందరికీ తెలిసిన విషయమే. చంద్రన్న అబద్ధాలు మానుకోలేదా? అనే అనుమానం రాజకీయపార్టీలు, విశ్లేషకులు, మేధావులతోపాటు అటు ప్రజల్లోనూ తలెత్తింది. వారు తల గోక్కొనేలోపే తన నైజాన్ని మరింత బలంగా చాటారు చంద్రబాబు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేదన్నారు. సంక్షేమ పథకాలు ఇప్పట్లో ఇవ్వలేనన్నారు. చంద్రబాబు వ్యాఖ్యలపై ప్రజలు, రాజకీయ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



వంచన చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య



ప్రజలను వంచించడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. ఎన్నికల సమయంలో కుప్పలు తెప్పలుగా హామీలు ఇచ్చి గద్దెనెక్కాక ఏ ఒక్కటీ నెరవేర్చక ప్రజలను వంచించడం బాబు నైజం. గత ఎన్నికల్లోనూ సూపర్‌సిక్స్ పేరుతో హామీలు ఇచ్చాడు. ఇప్పటికీ ఏ ఒక్కటి నెరవేర్చలేదు. బాబు మాటలు నమ్మి జనం మోసపోయారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చి కూటమి ప్రభుత్వం మాట నిలుపుకోవాలి. లేదంటే ప్రజలు బుద్ధి చెబుతారు.

–కోన రఘుపతి, మాజీ ఎమ్మెల్యే, బాపట్ల

ప్రజలను మోసం చేయకూడదు



సూపర్ సిక్స్ పథకాలతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన వాగ్దానాలన్నీ అమలు చేయాల్సిందే. ప్రధానంగా తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, వంట గ్యాస్ వంటి పథకాలు సూపర్ సిక్స్‌లో ఉన్నాయి. వీటన్నింటినీ అమలు చేసినప్పుడే నిజమైన నేతగా ఉంటారు.

కరణం వెంకటేష్,
చీరాల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త

ప్రజలను మోసగిస్తున్న చంద్రబాబు



బూటకపు హామీలతో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిసారి ఆంధ్ర ప్రజలను మోసగిస్తూనే ఉన్నాడు. సూపర్ సిక్స్ పేరుతో పథకాలు ప్రకటించి.. ప్రభుత్వం ఏర్పడి 7 నెలలు దాటినా ఇప్పటి వరకు అమలు చేయలేదు. వలంటీర్ వ్యవస్థనే తొలగించారు. ఉచిత ఇసుక అంటూ దోపిడీ విధానాన్ని తీసుకొచ్చారు. రిజిస్ట్రేషన్ చార్జీలు భారీగా పెంచుతున్నారు.

–గాదె మధుసూదనరెడ్డి,
వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, పర్చూరు

చంద్రబాబుకు అలవాటే



ఎన్నికలకు ముందు బూటకపు హామీలివ్వటం, గెలుపొందాక మాటమార్చటం చంద్రబాబుకు అలవాటే. అధికారం కోసం ఎన్నికల ముందు అమలు చేయలేని హామీలిచ్చారు. తీరా గెలిచాక పథకాల అమలుకు రాష్ట్ర బడ్జెట్ లేదంటూ చేతులెత్తేయటం చంద్రబాబు నైజం.

డాక్టర్ ఈవూరు గణేష్,
వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, రేపల్లె

ప్రజలు క్షమించరు



అబద్ధపు హామీలతో అధికారాన్ని దక్కించుకున్న చంద్రబాబు లోటు సాకుతో ప్రజలకు ఇవ్వాల్సిన పథకాలను ఇవ్వకుండా కుంటి సాకులతో కాలయాపన చేయాలనుకుంటే ప్రజలు క్షమించరు. తక్షణం ఎన్నికలకు ముందు మేనిఫెస్టోలో ప్రకటించిన పథకాలను అమలు చేయాలి.

వరికూటి అశోక్‌బాబు, వైఎస్సార్ సీపీ
నియోజకవర్గ సమన్వయకర్త, వేమూరు

మరోసారి మోసం చేశాడు



చంద్రబాబు ప్రజలను మరోసారి మోసం చేశాడు. ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పేరుతో హామీలు ఇచ్చాడు. తీరా గెలిచిన తర్వాత పథకాల అమలుకు డబ్బు లేదని నిస్సిగ్గుగా చెబుతున్నాడు. ఆర్థిక పరిస్థితి బాగా లేదు. పథకాల అమలుకు పదేళ్లు పడుతుందని చెప్పడం విడ్డూరం.

పానెం చిన హనిమిరెడ్డి, వైఎస్సార్ సీపీ
అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త

బైపాస్ రోడ్డు పనులు ప్రారంభం

- తొలి రోజు 9 కిలోమీటర్ల మేర మార్కింగ్ పూర్తి
- నేడు పూర్తి కానున్న ప్రక్రియ

నరసరావుపేట రూరల్: బైపాస్ రోడ్డు పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. చీరాల వాడరేవు–నకరికల్లు జాతీయ రహదారి విస్తరణలో భాగంగా చేపడుతున్న నరసరావుపేట బైపాస్ రోడ్డు పనులు మంగళవారం ప్రారంభించారు. మండలంలోని రావిపాడు, గుంటగార్లపాడు, ఇస్సప్పాలెం, జొన్నలగడ్డ, కేసానుపల్లి గ్రామాల పరిధిలో 17 కిలోమీటర్ల మేర బైపాస్ రోడ్డును నిర్మించాల్సి ఉంది. ఆయా గ్రామాల పరిధిలోని భూములు కోల్పోతున్న రైతులు దీనిని వ్యతిరేకిస్తూ వస్తున్నారు. విలువైన భూములు బైపాస్‌రోడ్డుకు ఇచ్చేందుకు రైతులు అంగీకరించకపోవడంతో జిల్లా రెవెన్యూ అధికారులు పలు మార్లు వారితో సమావేశాలు నిర్వహించారు. అధికారుల ప్రతిపాదనలకు రైతులు వ్యతిరేకించారు. ఈ నేపథ్యంలో భారీగా పోలీసు బందోబస్తు మధ్య బైపాస్ రోడ్డు సర్వేను ప్రారంభించారు.

తొలిరోజు 60 శాతం పూర్తి

రావిపాడు –శాంతినగర్ మధ్య ప్రాంతం నుంచి సర్వేను ప్రారంభించారు. తహసీల్దార్ వేణుగోపాలరావు, హైవే అథారిటీ అధికారుల పర్యవేక్షణలో సర్వే జరిగింది. శాటిలైట్ ఆధారంగా మార్కింగ్ ఇచ్చే పనిని చేపట్టారు. పంట భూముల్లో బైపాస్ రోడ్డును నిర్మించే 45 మీటర్ల మేర మార్కింగ్ చేశారు. మూడు బృందాలు ఈ సర్వేలో పాల్గొన్నాయి. మొదటి రోజు జొన్నలగడ్డ బైపాస్ వరకు ప్రక్రియ పూర్తయింది. మొత్తం 17 కిలోమీటర్లలో తొలిరోజు 9 కిలోమీటర్ల మేర మార్కింగ్ పూర్తి చేశారు. శాటిలైట్ లింక్ అందని కారణంగా రావిపాడు పరిధిలో ఒక కిలోమీటరు, గుంటగార్లపాడులో కొంత మేరకు మార్కింగ్ ప్రక్రియ నిలిచిపోయింది. బుధవారం కేసానుపల్లి పరిధిలోని ఐదు కిలోమీటర్లతోపాటు రావిపాడు, గుంటగార్లపాడులో మిగిలిపోయిన మార్కింగ్‌ను పూర్తిచేయనున్నారు. రైతుల నుంచి వ్యతిరేకత కారణంగా భారీ పోలీసు బందోబస్తును సర్వే పనులకు ఏర్పాటు చేశారు.

న్యూస్‌రీల్

వరల్డ్ తైక్వాండో రిఫరీగా వెంకటేశ్వరరావు



నిజాంపట్నం: ఈనెల 17 నుంచి 26వ తేదీ వరకు వరల్డ్ తైక్వాండో వారు ఇండియా తైక్వాండో ఆధ్వర్యంలో మహారాష్ట్ర పూణేలో నిర్వహించిన ఇంటర్నేషనల్ రిఫరీ కోర్స్‌లో ఆంధ్రప్రదేశ్ బాపట్ల జిల్లా రేపల్లెకు చెందిన రాష్ట్ర తైక్వాండో ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు పాల్గొని అంతర్జాతీయ రెఫరీగా అర్హత సాధించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అంతర్జాతీయ తైక్వాండో క్రీడాకారులను తయారు చేయటానికి అవకాశం లభించటం అదృష్టంగా పేర్కొన్నారు. నేటి వరకు వేలాది మంది క్రీడాకారులకు శిక్షణ ఇచ్చామని, తన వద్ద శిక్షణ పొందిన అనేక మంది జాతీయ స్థాయిలో పతకాలు సాధించారని తెలిపారు.

వైన్ షాపులో చోరీ

రూ.4 లక్షల విలువగల మద్యం అపహరణ



అద్దంకి రూరల్: వైన్ షాపు వెనుక రేకులను పగులగొట్టి మద్యం కేసులను దొంగిలించారు. ఈ ఘటన అద్దంకి మండలంలోని శాంతినగర్ వద్ద ఉన్న వైన్‌షాపులో సోమవారం అర్ధరాత్రి జరగ్గా మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఘటనా స్థలానికి చేరుకుని సీఐ సుబ్బారాజు దొంగతనం జరిగిన తీరును తెలుసుకున్నారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. వైన్ షాపు యజమాని సోమవారం రాత్రి వ్యాపారం ముగించుకుని షాపునకు తాళం వేసుకుని ఇంటికి వెళ్లారు. ఈనేపథ్యంలో మంగళవారం ఉదయం షాపు తెరచి చూడగా షాపులో రూ.4 లక్షల విలువచేసే మద్యం కేసులు, సీసీ కెమెరాల మోనిటర్ సిస్టంలు కనబడలేదు. షాపు వెనుకవైపు ఉన్న రేకులు తొలగించి ఉన్నాయి. దొంగతనం జరిగిందని అద్దంకి పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో సీఐ, ఎస్సైలు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

భర్త తల పగలగొట్టిన భార్య

చినగంజాం: భర్తతో గొడవపడిన భార్య అతనిని రాయితో తలపై కొట్టడంతో గాయలపాలైన సంఘటన మండలంలోని కడవకుదురు గ్రామంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం ప్రకారం మండలంలోని కడవకుదురు గ్రామంలోని యానాది కాలనీకి చెందిన బొజ్జా రాజా, వెంకటరమణలకు 18 నెలలు కిందట వివాహమయింది. వీరికి ఒక బాబు ఉన్నాడు. వెంకటరమణ కడవకుదురు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో పనిచేస్తోంది. భర్త రాజా ఇల్లు తాకట్టు పెట్టి రూ.5 లక్షలు రుణం తీసుకొని ఆమెకు బంగారం చేయించాడు. అటు తరువాత డబ్బు అవసరమై కొంత బంగారాన్ని తాకట్టు పెట్టుకొని రూ.1.20 రుణం తీసుకున్నాడు. ఈ క్రమంలో ఆమె ఏడాది కిందట భర్తతో విడిపోయి దూరంగా చినగంజాంలోని మహాలక్ష్మీ కాలనీలో నివాసముంటోంది. సోమవారం సాయంత్రం కడవకుదురులో భర్త తమ్ముని దుకాణం దగ్గర ఉన్న సమయంలో ఆమె భర్తను నిలదీసి తన బంగారం ఇవ్వాల్సిందిగా కోరింది. రోడ్డు మీద గొడవ ఎందుకు అంటూ ఆమె తమ యానాది కాలనీలోని సంగంలోనికి తీసుకెళ్లింది. భర్త ఆమెను తాకట్టు నగదు ఇచ్చేసి ఆమె బంగారాన్ని తెచ్చుకొమ్మని కోరాడు. దీంతో వారిద్దరి మధ్య మాటమాట పెరిగింది. ఆమె పక్కనే రాయితో భర్త తలపగలగొట్టింది. గాయాలపాలైన రాజా చీరాల ఆస్పత్రిలో చేరి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ పేర్నాటి ప్రకాష్ తెలిపారు.

కేరళలో ఎయిర్ మెన్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

గుంటూరు ఎడ్యుకేషన్: భారత వైమానిక రంగంలో ఎయిర్ మెన్ (మెడికల్ అసిస్టెంట్) ఉద్యోగాలకు కేరళ కొచ్చిలోని 14 ఎయిర్‌మెన్ ఎంపిక కేంద్రంలో రిక్రూట్‌మెంట్ ర్యాలీ జరగనున్నట్లు యువజన సర్వీసుల శాఖ కార్యాలయం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఇంటర్ బయాలజీ అర్హత కలిగిన అభ్యర్థులు ఫిబ్రవరి 1న, డిప్లొమా, బీఎస్సీ ఇన్ ఫార్మసీ అభ్యర్థులు ఫిబ్రవరి 4న ఉదయం 6 గంటలకు ఎంపిక కేంద్రంలో హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు ఎయిర్‌ఫోర్స్ వెబ్‌సైట్ ఎయిర్‌మెన్ సెలక్షన్.సీడాక్.ఇన్‌ను సందర్శించాలని సూచించింది.

జిల్లా అభివృద్ధికి అధికారులు చొరవ తీసుకోవాలి

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి
- జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశం
- హాజరైన మంత్రులు అనగాని, గొట్టిపాటి



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి పార్థసారథి, వేదికపై మంత్రులు అనగాని, గొట్టిపాటి

బాపట్లటౌన్: జిల్లా అభివృద్ధికి అధికారులు చొరవ తీసుకోవాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశం మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించారు. మంత్రి కొలుసు మాట్లాడుతూ స్వర్ణాంధ్రప్రదేశ్–2047 నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ప్రభుత్వ ఆలోచనలను ప్రజల వద్దకు తీసుకువెళ్లే బాధ్యత అధికారులపై ఉందన్నారు. అభివృద్ధి విషయంలో నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలన్నారు. రోడ్ల మరమ్మతు పనుల్లో గుత్తేదారులు నాణ్యత పాటించకపోతే ఒప్పందాలను రద్దు చేయాలన్నారు. గుంతలు పూడ్చే కార్యక్రమంలో జాప్యంపై పలువురు ప్రజాప్రతినిధులు ఆర్ అండ్ బీ అధికారులను ప్రశ్నించారు. దీంతో సీఆర్ఎఫ్, ఎండీఆర్ఎఫ్ పెండింగ్ పనులపై మంత్రి కొలుసు ఆరా తీశారు. నిధులు ఇస్తున్నప్పటికీ ఎందుకు పనిచేయడం లేదని నిలదీశారు. ప్రారంభించని పనులను రద్దు చేయాలని ఆదేశించారు. నిబంధనలు విస్మరించిన గుత్తేదారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. అమృతధార పథకం కింద ప్రతి ఇంటికి సురక్షిత నీటిని అందిస్తామన్నారు. సాగునీటి కాల్వల బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. 92 ఎత్తిపోతల పథకాల కింద 1.07 లక్షల ఎకరాలు పంటలు సాగు అవుతుండగా, 67 పథకాలు మాత్రమే పనిచేస్తున్నాయని తెలిపారు. తాత్కాలిక మరమ్మతులు, శాశ్వత సమస్యల పరిష్కారం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. రూ.110 కోట్లతో ఉపాధి పనులు జరుగుతుండగా, రూ.31 కోట్ల పనులు మిగలడంపై అసహనం వ్యక్తం చేశారు. గడువులోగా లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. టీఏ, ఎఫ్ఏ ఉద్యోగాల భర్తీకి తక్షణమే ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. సూర్యలంక, చీరాల బీచ్ అభివృద్ధిపై ప్రతిపాదనలు సిద్ధం చేస్తే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తామన్నారు. సూర్యలంక బీచ్ అభివృద్ధికి రూ.97 కోట్లతో డీపీఆర్ సిద్ధం చేసి కేంద్రానికి నివేదించామన్నారు. బాపట్ల జిల్లాలో 50వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని, మరో ఏడు వేల మెట్రిక్ టన్నుల సేకరణకు ప్రభుత్వం తాజాగా అనుమతించిందన్నారు.

సూర్య ఘర్ పథకం విస్తరణకు సహకరించాలి

విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ విద్యుత్ సమస్యలు రాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. సూర్య ఘర్ పథకం కింద 334 యూనిట్లు ఏర్పాటు చేశామని, మరింత విస్తరింప చేయడానికి బ్యాంకులు సహకరించాలన్నారు. అద్దంకి నియోజకవర్గాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుంటున్నామన్నారు. సాగు కాల్వల పెండింగ్ బిల్లులపై నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

సాగు కాల్వల మరమ్మతులు చేపట్టాలి

రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ సాగునీటి కాల్వల మరమ్మతు పనులు వెంటనే చేపట్టాలన్నారు. వెల్లటూరు కాల్వ పనుల్లో జాప్యం చేయరాదన్నారు. రేపల్లె నియోజకవర్గంలో ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీలు చేయాలన్నారు. ఇటీవల జరిగిన తనిఖీలలో దస్త్రాలు చూపకుండా పలుమార్లు ఇబ్బందులు పెడుతున్న వ్యక్తులను సస్పెండ్ చేయాలని ఆదేశించారు.

నిధులు విడుదలకు సీఎం హామీ

బాపట్లలో వైద్య కళాశాల నిర్మాణానికి మూడో విడతలో నిధులు విడుదల చేస్తామని సీఎం హామీ ఇచ్చినట్లు బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణప్రసాద్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు రుణ సదుపాయం కల్పించాలని అధికారులకు సూచించారు. సూర్యఘర్ పథకానికి బ్యాంకుల సహకరించాలన్నారు.

రూ.3,500 కోట్లతో డీపీఆర్

కలెక్టర్ వెంకట మురళి మాట్లాడుతూ ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీటి నీరు సరఫరా చేయడానికి రూ.3,500 కోట్లతో డీపీఆర్ పంపామన్నారు. అమృత ధార పథకం కింద 2.16 లక్షల గృహాలకు ట్యాప్ కనెక్షన్లు ఇవ్వడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రకాశం బ్యారేజీ నుంచి వేమూరు, రేపల్లె, బాపట్ల, చీరాల, పర్చూరు నియోజకవర్గాలలోని 18 మండలాలకు నీరు అందించేలా రూ.1,820 కోట్లతో నివేదించామన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు, ఏలూరి సాంబశివరావు, వేగేశన నరేంద్రవర్మ, జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, జేసీ ప్రఖర్ జైన్, డీఆర్వో జి గంగాధర్‌గౌడ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఎద్దుల బల ప్రదర్శన



రెంటచింతల: స్థానిక కానుకమాత చర్చి 175 వజ్రోత్సవ తిరునాళ్ల మహోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నిర్వహించిన జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎద్దుల బలప్రదర్శన హోరాహోరీగా సాగింది. రెండు పండ్ల సైజ్ విభాగంలో జరిగిన ఈ ప్రదర్శనలో సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన నల్లబోతు ప్రవీణ్ కుమార్, ప్రవల్లిక, బాపట్ల జిల్లా రేపల్లెకు చెందిన బోయిన నాగరాజు కంబైన్డ్ గిత్తలు 3,600 అడుగుల దూరం లాగి ప్రథమ బహుమతిగా రూ.30వేలు పొందాయి. పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలం మాదల గ్రామానికి చెందిన జువ్వాజి మేఘనాథ్‌నాయుడు గిత్తలు 3,359.30 అడుగుల దూరం లాగి రెండవ బహుమతి రూ.25వేలు దక్కించుకున్నా యి. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం తక్కెళ్లపాడుకు చెందిన ఎం.నవీన్‌కుమార్, పల్నాడు జిల్లా ఈపూరు మండలం అంగలూరుకు చెందిన ఆర్.హరిబాబు కంబైన్డ్ గిత్తలు 3,300 అడుగుల దూరం లాగి 3వ బహు మతి రూ.20 వేలు కైవసం చేసుకున్నాయి. ప్రకాశం జిల్లా రాచర్ల మండలం ఆకివీడు గ్రామానికి చెందిన బి.విజయలక్ష్మినాయుడు గిత్తలు 3,251 అడు గుల దూరం లాగి 4వ బహుమతి రూ.16 వేలు దక్కించుకున్నాయి. నంద్యాల జిల్లా గడివేముల మండలం గడిగరేవులకు చెందిన పి.సంజయ్‌కుమార్ గిత్తలు 3,221.6 అడుగుల దూరం లాగి 5వ బహుమతి రూ.13 వేలు గెలుచుకున్నాయి. ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం అక్కల రెడ్డిపల్లెకు చెందిన ఎం.నాగార్జున గిత్తలు 3,163 అడుగులు లాగి 6వ బహుమతి రూ.12 వేలను పొందాయి. పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం వేల్పూరు గ్రామానికి చెందిన సీహెచ్ హేమంత్‌సాయికుమార్, పల్నాడు జిల్లా క్రోసూరు మండలం 88 తాళ్లూరుకు చెందిన ఎం.ప్రవీణ్‌కుమార్ కంబైన్డ్ గిత్తలు 2,876.7 అడుగులతో 7వ బహుమతి రూ.11వేలు కైవసం చేసుకున్నాయి. ప్రకాశం జిల్లా బెస్తవారిపేట మండలం బసినపల్లె గ్రామానికి చెందిన వై.వెంకట చైతన్యకుమార్ గిత్తలు 2,688.1 అడుగులు లాగి 8 వబహుమతి రూ.10 వేలు దక్కించుకున్నాయి. ప్రకాశం జిల్లా రాచర్ల మండలం ఆకివీడు గ్రామానికి చెందిన బి.విజయలక్ష్మి నాయుడు గిత్తలు 2,681.6 అడుగులు లాగి 9వ బహుమతి రూ.9వేలు గెలుచుకున్నాయి. బలప్రదర్శనలో మొత్తం 15 జతలు పాల్గొన్నాయి. మిగిలిన 6 జతలకు కూడా రూ.3 వేలు చొప్పున అందజేశారు.

అప్పు పుట్టడం గగనంగా మారింది

- సూపర్ సిక్స్ పథకాలను ఎలాగైనా అమలు చేస్తాం
- చేనేతల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి అండగా నిలుస్తాం
- సీసీ రోడ్లు ప్రారంభోత్సవంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి పారర్థసారథి



సీసీ రోడ్డు ప్రారంభోత్సవం చేస్తున్న మంత్రి పార్థసారథి, కలెక్టర్ వెంకట మురళి, ఎమ్మెల్యే కొండయ్య, నరేంద్రవర్మ

చీరాల టౌన్: రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉందని.. అయినా రాష్ట్రాన్ని ముందంజలో ఉంచేందుకు ప్రభుత్వం పనిచేస్తున్నట్లు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మంగళవారం చీరాల మండలం దేవాంగపురి గ్రామ పంచాయతీలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.47.50 లక్షలతో నిర్మాణం చేసిన సీసీ రోడ్లను కలెక్టర్ వెంకట మురళి, ఎమ్మెల్యే ఎంఎం కొండయ్యతో కలిసి ప్రారంభించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు చీరాల ఆర్డీవో టి.చంద్రశేఖర నాయుడు అధ్యక్షత వహించారు. సభలో మంత్రి మాట్లాడుతూ చీరాలకు గుర్తింపు తెచ్చిన మహోన్నత వ్యక్తి ప్రగడ కోటయ్య, గద్దం కోటయ్యల గురించి అంతా తెలుసుకోవాలన్నారు. ఏపీకీ ఎక్కడా అప్పు పుట్టకపోవడంతో సీఎం నిద్రలేని రాత్రులు గడుపుతున్నారన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి సీఎం, డిప్యూటీ సీఎం ఎనలేని కృషి చేస్తున్నా ఆర్థిక పరిస్థితి ఆటంకంగా మారిందన్నారు. ఆర్థిక పరిస్థితి మెరుగుపడగానే సూపర్ సిక్స్ అమలు చేస్తామన్నారు. చీరాల నియోజకవర్గంలో చేనేతల కోసం టెక్స్‌టైల్ పార్కు, హార్బర్ పనులు త్వరలోనే పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు. కలెక్టర్ వెంకట మురళి మాట్లాడుతూ చీరాల్లో రూ.8 కోట్లు ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో 10 కిలోమీటర్ల మేర 96 సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. జిల్లాలో రూ.157 కి.మీ మేర 868 సీసీ రోడ్లను రూ.91 కోట్లతో నిర్మాణం చేస్తుండగా 70 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. జిల్లాలో 650 గోకులం షెడ్లు పూర్తి చేస్తున్నామన్నారు. చీరాల నియోజకవర్గంలో రోడ్లు, డ్రైన్లు నిర్మాణానికి రూ.4 కోట్లు కేటాయింపులో రూ.57లక్షలతో కొన్ని పనులు పూర్తయ్యాయని తెలిపారు. వాడరేవులో మారిటైం బోర్డు సహకారంతో హార్బర్ పనులు త్వరగా పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. 4వేల మంది యానాదులకు ఆధార్‌కార్డులు, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని తెలిపారు. చీరాల ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనకు అధికారులు, ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. బాపట్ల ఎమ్మెల్యే నరేంద్రవర్మ మాట్లాడుతూ చీరాల–బాపట్ల జంట నగరాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నామన్నారు. అనంతరం అతిథులను జీడిపప్పు మాలతో సన్మానించారు. హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ సజ్జా హేమలత, డ్వామా పీడీ విజయలక్ష్మి, తహసీల్దార్ గోపీకృష్ణ, ఎంపీడీవో శివసుబ్రమణ్యం, చీరాల డీఎస్పీ మొయిన్, సీఐలు శ్రీనివాసరావు, శేషగిరిరావు, టీడీపీ నాయకులు సిద్ది బుచ్చేశ్వరరావు, వీరభద్రయ్య, పురుషోత్తం, గజవల్లి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ శాఖలో నిఘా విభాగం విధులు కీలకం

ఎస్పీ తుషార్ డూడీ

బాపట్లటౌన్: పోలీస్‌శాఖలో నిఘా విభాగం విధులు కీలకమైనవని ఎస్పీ తుషార్ డూడీ అన్నారు. మంగళవారం జిల్లా నిఘా విభాగం పోలీసులతో ఎస్పీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ నిఘా విభాగంలో విధులు నిర్వర్తించే పోలీస్ సిబ్బంది ముందస్తుగా రహస్య సమాచారం సేకరించాలన్నారు. పోలీస్ శాఖ సమర్థవంతంగా విధులు నిర్వహించినప్పుడే అసాంఘిక కార్యకలాపాలు కట్టడి చేయగలమన్నారు. ముందస్తు సమాచారం సేకరించడం వలన ఆదిలోనే నేరాలను అరికట్టి శాంతిభద్రతలను పరిరక్షించవచ్చన్నారు. నిత్యం ప్రజలతో మమేకమై గతంలో నేరాలకు పాల్పడిన వ్యక్తులు, చెడు నడత కలిగిన వ్యక్తుల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలన్నారు. అట్టివారు ఏదైనా నేరానికి పాల్పడే అవకాశం ఉందని గ్రహిస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. గంజాయి వంటి మాదకద్రవ్యాల అమ్మకం, వినియోగం వంటి వాటి మీద ప్రత్యేకంగా నిఘా ఉంచాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా పేకాట, కోడిపందేలు వంటి ఇతర అసాంఘిక కార్యకలాపాలు గురించిన ముందస్తు సమాచారం ఉన్నతాధికారులకు అందించాలన్నారు. ప్రతి ఒక్కరూ నిబద్ధతతో అంకితభావంతో విధులు నిర్వహించాలన్నారు. సమావేశంలో ఎస్‌బీ సీఐ నారాయణ, జిల్లా ఎస్‌బీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ తుషార్‌డూడీ

కొప్పరపాడు వైన్‌షాపులో చోరీ

బల్లికురవ: మండలంలోని కొప్పరపాడు గ్రామ సమీపంలోని గొర్రెపాడు రోడ్డులో ఉన్న అంకమ్మతల్లి వైన్ షాపులో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. వాచ్‌మన్‌ను బెదిరించి షట్టర్ తాళాలు పగులగొట్టి షాపులో ఉన్న రూ.20 వేల నగదు, 96 క్వార్టర్ బాటిళ్లు చోరీ చేశారు. సమాచారం అందుకున్న సంతమాగులూరు, అద్దంకి సీఐలు వెంకటరావు, సుబ్బరాజు ఎస్సై జీవీ చౌదరి మంగళవారం ఘటనా స్థలాన్ని పరిశీలించి క్లూస్ టీమ్‌ను పిలపించి వేలిముద్రలు సేకరించారు.



కొప్పరపాడులో చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్సైలు

మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసుకోవాలి

రేపల్లె రూరల్: ఆంధ్రప్రదేశ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలో ఫిబ్రవరి 1 నుంచి 2025 సెప్టెంబర్ 1వ తేదీ వరకు మద్యం షాపులు పొందేందుకు నోటిఫికేషన్ విడుదలైనట్లు రేపల్లె ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ దివాకర్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. రేపల్లె మున్సిపాలిటీ పరిధిలోని బీపీఎల్/119, బీపీఎల్/126 దుకాణాలు పొందేందుకు గౌడ కులస్తులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫిబ్రవరి 5వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు సమర్పించటంతోపాటు నాన్ రిఫండబుల్ అప్లికేషన్ ఫీజులు చెల్లించాలన్నారు. దరఖాస్తులను 6వ తేదీన పరిశీలిస్తారని, 7వ తేదీన బాపట్ల కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో వేలంగాని, లాటరీ పద్ధతిలో లబ్ధిదారుని ఎంపిక చేస్తారన్నారు. నాన్ రిఫండ్‌బుల్ అప్లికేషన్ ఫీజు కింద రూ.2లక్షలు చెల్లించాలన్నారు. ఆసక్తి కలిగిన వారు సంబంధిత వెబ్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

నగరం: కల్లు గీత కులాలకు 10 శాతం రిజర్వేషన్ కింద కేటాయించిన షాపులకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ శ్రీరామ్‌ప్రసాద్ చెప్పారు. మంగళవారం విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మండలంలో గౌడ కులస్తులకు మద్యం దుకాణం కేటాయించినట్లు తెలిపారు. అర్హత కలిగిన వారు ఫిబ్రవరి 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9440902477, 9490455595 నంబర్లలో సంప్రదించాలన్నారు.

జీవితంలో మర్చిపోలేని అనుభూతి

- ఏట్రవారిపాలెం సర్పంచ్ వెంకటలక్ష్మి
- ఢిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకలను ప్రత్యక్షంగా తిలకించిన సర్పంచ్
- వెంకటలక్ష్మి దంపతులకు సన్మానం

కర్లపాలెం: గణతంత్ర వేడుకలు అద్భుతంగా జరిగాయని కర్లపాలెం మండలం ఏట్రవారిపాలెం గ్రామ పంచాయతీ సర్పంచ్ చీరాల వెంకటలక్ష్మి పేర్కొన్నారు. ఈనెల 26వ తేదీన జరిగిన గణతంత్ర వేడుకలకు ప్రభుత్వ ఆహ్వానంపై ఆమె ఢిల్లీ వెళ్లారు. వేడుకలను ప్రత్యక్షంగా తిలకించారు. అనంతరం ఏట్రవారిపాలెం వచ్చిన సర్పంచ్ వెంకటలక్ష్మి దంపతులకు ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్‌రెడ్డి సన్మానించారు. సర్పంచ్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ గణతంత్ర వేడుకలకు జిల్లా నుంచి తన ఒక్కరికే అవకాశం రావటం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. ఏట్రవారిపాలెం గ్రామ పంచాయతీని నిస్వార్థంగా అభివృద్ధి పథంలో నిలుపుతున్నందుకే ప్రభుత్వం తనకు ఈ అవకాశం కల్పించిందన్నారు. టీవీలలో గణతంత్ర వేడుకలు చూసి ఆనందపడేదాన్నని తెలిపారు. తన భర్త శ్రీనివాసరెడ్డితో కలసి ఢిల్లీ వెళ్లి ప్రత్యక్షంగా తిలకించడం చెప్పలేని అనుభూతి కలిగిందని తెలిపారు. భిన్నత్వంలో ఏకత్వం కలిగిన మన భారత దేశ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ ప్రదర్శించిన పలు రాష్ట్రాలకు చెందిన శకటాలు ఆకర్షణగా నిలిచాయని తెలిపారు. భారత త్రివిధ దళాలు ప్రదర్శించిన సాయుధ శక్తిని, విన్యాసాలను చూసి తన్మయత్వానికి లోనయ్యానని ఆమె తెలిపారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ చీరాల సత్యనారాయణరెడ్డి, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు పంచాయతీ కార్యదర్శి మురళీకృష్ణ, వార్డు మెంబర్లు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.



ఏట్రవారిపాలెం సర్పంచ్ వెంకటలక్ష్మి దంపతులను సన్మానిస్తున్న అధికారులు ప్రజాప్రతినిధులు

ఫిబ్రవరి 19, 20 తేదీల్లో ఆక్వా కల్చర్‌పై జాతీయ సదస్సు

ఏఎన్‌యూ(గుంటూరు): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని జువాలజీ అండ్ ఆక్వా కల్చర్ విభాగం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 19, 20 తేదీల్లో జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు సదస్సు డైరెక్టర్ ఆచార్య వి.వెంకటరత్నమ్మ తెలిపారు. మంగళవారం వీసీ ఆచార్య కె.గంగాధరరావు సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరించారు. రీసెంట్ డెవలప్‌మెంట్ ఇన్ ఆక్వా కల్చర్ మేనేజ్మెంట్ అనే అంశంపై సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కె. వీరయ్య పాల్గొన్నారు.

అయోధ్య రామిరెడ్డితో డాక్టర్ గణేష్ భేటీ

రేపల్లె రూరల్: రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డిని వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ మంగళవారం గుంటూరులోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ బలోపేతం, సంస్థాగత నిర్మాణం, క్షేత్రస్థాయిలో పార్టీకి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు చేస్తున్న వివరాలను రామిరెడ్డితో చర్చించారు.



రాజ్యసభ సభ్యుడు అయోధ్య రామిరెడ్డిని కలిసిన డాక్టర్ ఈవూరు గణేష్

జాతీయ తైక్వాండో పోటీలకు చీరాల క్రీడాకారిణి ఎంపిక

చీరాలరూరల్: జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు చీరాల తైక్వాండో క్రీడాకారిణి జి.శివనాగ సాయిప్రియ ఎంపికైంది. ఇటీవల తిరుపతిలో జరిగిన సీనియర్స్ రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో శివనాగ సాయిప్రియ పాల్గొని విశేష ప్రతిభతో ప్రత్యర్థులను చిత్తు చేసింది. దీంతో సెలక్టర్లు ఆమెను జాతీయ స్థాయి పోటీలకు ఎంపికచేసినట్లు కోచ్ సయ్యద్ సలావుద్దీన్ తెలిపారు. జాతీయ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఈ ఏడాది ఫిబ్రవరి 3, 4 తేదీల్లో 38వ జాతీయ స్థాయి తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలు ఉత్తరాఖండ్ రాష్ట్రం హల్ద్వానిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఇద్దరు ఎంపిక కాగా చీరాల నుంచి శివనాగ సాయిప్రియ మాత్రమే ఎంపికయ్యారని తెలిపారు. జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైన శివనాగ సాయిప్రియ, కోచ్‌లు సయ్యద్ సలావుద్దీన్, సీహెచ్ వెంకట ప్రసాద్, పి.ప్రశాంత్‌బాబులు స్థానిక ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్యను మంగళవారం క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.



శివనాగ సాయిప్రియను, కోచ్‌లను అభినందిస్తున్న ఎమ్మెల్యే ఎం.ఎం.కొండయ్య